నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 20 మే 2025 | KAMAREDDY

## కామారెడ్డిలో భారీ వర్షం





గాంధీ గంజ్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

### గాంధీగంజ్‌లో తడిసిన ధాన్యం

కామారెడ్డి, మే 19 : కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అకాల వర్షానికి స్థానిక గాంధీ గంజ్‌లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసుకున్న వడ్లు తడిసిపోయాయి. ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకుందామనుకునే లోపు తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేవలం ధాన్యం తడవకుండా టార్పాలిన్లు మాత్రమే ఇచ్చారని, కానీ తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయడం లేదని వాపోయారు. కొన్నిచోట్ల ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి.

### ఉమ్మడి జిల్లాపై రూ.200 కోట్లు భారం..

కాంగ్రెస్ ప్రభుత్వం తీరు చెప్పేదొకటి చేసేదొకటి అన్నట్లుగా మారింది. కేసీఆర్ హయాంలో మద్యం ధరలను పెంచితే గగ్గోలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇష్టానుసారంగా ధరల భారాన్ని సామాన్యులపై మోపుతున్నది. ఇదేంటని అడిగితే సమాధానాలు ఇవ్వకుండా సర్కారు తప్పించుకుంటున్నది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఏటా సుమారుగా 16లక్షల విస్కీ, 28లక్షల బీర్ కేసులు అమ్ముడవుతాయి. వీటి మొత్తం విలువ దాదాపుగా రూ.1700 కోట్లుగా ఉంటుంది. తాజాగా సర్కారు తీసుకున్న నిర్ణయం మేరకు ఉమ్మడి జిల్లాలో అమ్ముడవుతున్న మద్యం బాటిళ్లపై అదనంగా పడే ధరల ప్రభావంతో మందుబాబుల జేబులకు చిల్లులు పడనున్నది. సుమారు ఏటా రూ.200 కోట్లు వరకు భారం పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చీప్ లిక్కర్, బీరు జోలికి వెళ్లకుండా మిగిలిన మద్యంపై ధర భారాన్ని సర్కారు మోపింది. ఈ మేరకు సవరించిన ధరల పట్టిక సోమవారం నుంచే అమల్లోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాదాపూర్‌లోని ఐఎంఎల్ డిపోలో పెరిగిన మద్యం ధరల ఆధారంగానే మద్యం యజమానుల నుంచి ఇండెంట్‌ను తీసుకున్నారు. ఒక్కసారిగా పెరిగిన ధరల పట్టిక జాబితాను చూసి మద్యం వ్యాపారులే ఆశ్చర్యానికి గురయ్యారు. పెరిగిన ధరల మూలంగా పెట్టుబడి మూల ధనం సైతం ఒక్కసారిగా ఎగబాకింది. సవరించిన ధరల పట్టిక ఆయా బ్రాండ్‌లను బట్టి మారనున్నది.

### బెల్ట్ షాపుల్లో డబుల్ రేట్లు

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్రమ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. లైసెన్సుడ్ దుకాణాలు కాకుండా బెల్టు షాపులను అనధికారికంగా పెంచి పోషిస్తున్నారు. కండ్ల ముందే బెల్టు షాపులు జోరుగా కొనసాగుతున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. ధరల పెరుగుదలతో బెల్టు షాపులో క్వార్టర్, ఆఫ్, ఫుల్ బాటిళ్ల ధరలు సైతం అమాంతం ఎగబాకనున్నాయి. అధికారికంగా ఫుల్ బాటిల్‌పై ధర రూ.40 పెరిగితే వాటికి అదనంగా మరింత జోడించి మద్యం ప్రియుల వద్ద నిర్వాహకులు వసూళ్లు చేయనున్నారు. మద్యం దుకాణాల సంఖ్య మండలానికి ఒకటి నుంచి రెండు వరకు విస్తరిస్తే... బెల్టు దుకాణాలు మాత్రం అందుకు రెట్టింపు స్థాయిలో ఏర్పడ్డాయి. ప్రతి మద్యం బాటిల్ ధరకు 5 నుంచి 10 శాతం మేర అధిక ధరలతో విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో బెల్టు దుకాణాలన్నీ విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నప్పటికీ పోలీసులు, ఆబ్కారీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పల్లెలన్నీ చీకటి పడితే... మద్యం బాటిళ్ల సప్పుడుతో సందడిగా మారుతున్నాయి. మద్యం నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందుతోంది. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో మద్యం అమ్మకాలను పరిశీలిస్తే నియంత్రణ అన్నది మచ్చుకూ కూడా కనిపించడం లేదు.

## మందుబాబులకు
# సర్కారు షాక్ !

లిక్కర్ ధరలు భారీగా పెంపు



- ఫుల్ బాటిల్‌పై సరాసరి రూ.40 భారం...
- క్వార్టర్‌పై రూ.10, ఆఫ్ బాటిల్‌పై రూ.20 వడ్డన
- ఈ నెల 19 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి..
- ఉమ్మడి జిల్లాపై ఏడాదికి రూ.200 కోట్ల మేర భారం
- ఇటీవలే బీర్ల ధరలు పెంపు
- పాత స్టాకు అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ నియంత్రణ పెట్టేనా...?

నిజామాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మందుబాబులకు రేవంత్ సర్కార్ షాకిచ్చింది. ఇటీవల బీర్ల ధరలను పెంచిన ప్రభుత్వం తాజాగా మద్యం ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే వరుసగా రెండోసారి ధరలను పెంచేసి సామాన్యులను దోపిడీకి గురి చేస్తోంది. క్వార్టర్, ఆఫ్, ఫుల్ బాటిళ్ల ధరలను భారీగా పెంచడంతో మందుబాబులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. క్వార్టర్‌కు రూ.10, ఆఫ్‌కు రూ.20, ఫుల్ బాటిల్‌కు రూ.40 చొప్పున ధరలను పెంచడంతో ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిన మద్యం వ్యాపారాన్ని సర్కారు పెంచి పోషిస్తోంది. ఇష్టమొచ్చినట్లుగా ధరలను పెంచి ఆదాయాన్ని ఆర్జిస్తోంది. సోమవారం నుంచి సవరించిన ధరల పట్టిక అమల్లోకి రావడంతో పాత స్టాక్‌పై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని ఆసక్తి నెలకొన్నది. ధరలు పెరిగినప్పుడల్లా ఆబ్కారీ శాఖ సిబ్బందికి ఆమ్యామ్యాలు అలవాటుగా మారింది.

పాత స్టాక్‌ను తారుమారు చేయడంలో కొంత మంది సిద్ధహస్తులుగా పేరొందారు. స్టాక్‌పై లేబుళ్లు వేసి కొత్త ధరల ప్రకారం మద్యం బాటిళ్లను అమ్మాల్సి ఉంటుంది. కానీ కొంత మంది వ్యాపారులతో కుమ్మక్కై తక్కువ ధర కలిగిన పాత స్టాక్‌ను పాత డేట్‌లో అమ్మినట్లుగా చూపించి వాటిని దొడ్డి దారిలో తప్పించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తుండడంతో పారదర్శక చర్యలు సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం
# ఎవరితరమూ కాదు

- కేసీఆర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటేనే కేసీఆర్
- రేవంత్‌రెడ్డి దిగజారుడు విమర్శలు మాని ఇచ్చిన హామీల అమలుపై దృష్టిసారించాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, మే 19: ప్రపంచమే గర్వించదగ్గ నిర్మాణాలు చేపట్టడం కేసీఆర్‌కే సాధ్యమని, ఆయన ఆనవాళ్లను చెరిపేయడం ఎవరితరమూ కాదని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తా అని చెప్పిన వాళ్లు ..ఇప్పుడు ఆ ఆనవాళ్లనే ప్రపంచానికి చూపించుకునే పరిస్థితి ఉన్నదని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన సచివాలయం, పోలీస్‌కమాండ్ కంట్రోల్‌సెంటర్, యాదాద్రి దేవాలయం తెలంగాణకు తలమానికాలని, ఇవి గొప్ప నిర్మాణాలని, చెరిపేస్తే చెరిగిపోవడానికి మట్టిరాతలు కాదని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం ఆయన ఆనవాళ్లు శాశ్వతంగా నిలిచిపోతాయని ఒక ప్రకటనలో వేముల పేర్కొన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన పోటీదారులతో తెలంగాణ గొప్పతనం ప్రపంచానికి తెలిసేలా చేయడానికి కేసీఆర్ కట్టించిన నిర్మాణాలు సెక్రటేరియేట్, పోలీస్ కమాండ్ కంట్రోల్, యాదాద్రిదేవాలయంతో పాటు రాచరిక పోకడలు అని మాట్లాడి తెలంగాణ చిహ్నం నుంచి తొలగించాలని అనుకున్న చార్మినార్, కాకతీయ కళావైభవాలే ఈ ప్రభుత్వానికి దిక్కయ్యాయని పేర్కొన్నారు. వీటన్నింటినీ తిలకించిన ప్రపంచ సుందరీమణులు సంబురంతో ఆశ్చర్యపోయారని, సెల్ఫీలు తీసుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ అమరుల త్యాగం తెలంగాణ ప్రజల గుండెల్లో నిరంతరం జ్వలించేలా కేసీఆర్ కట్టించిన అమరుల స్మారకజ్యోతి చిహ్నం, బడుగు బలహీన వర్గాల కోసం పనిచేయాలని పాలకుల్లో స్ఫూర్తి నింపే విధంగా కేసీఆర్ ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాలను కూడా మిస్‌వరల్డ్ పోటీదారులకు చూపిస్తే, తెలంగాణ చరిత్ర, అమరుల త్యాగం, రాజ్యాంగనిర్మాత అంబేద్కర్ గొప్పతనం విశ్వవ్యాప్తం అవుతుందని సూచించారు.

**రేవంత్‌పాలనలో ఇబ్బందుల్లో అన్నివర్గాల ప్రజలు**

తెలంగాణ అంటే కేసీఆర్...కేసీఆర్ అంటే తెలంగాణ అని, వాటిని చెరిపేయాలనుకోవడం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వమే అవుతుందని పేర్కొన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలో అగ్రగామిగా నిలిపితే, రేవంత్‌రెడ్డి అవగాహన లేని పరిపాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లో రోజురోజుకూ దిగజారుతున్నదన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ధాన్యం కొనేవారు లేక, అకాల వర్షాలకు తడిసిన ధాన్యం అమ్ముకోలేక బాధతో కల్లాల మీద రైతులు ప్రాణాలు వదులుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జీతాలు రాక చిన్న ఉద్యోగులు నిత్యం నిరసనలు తెలియజేస్తుంటే , ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరి వల్ల(గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాదం) అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటే... రాష్ట్రంలో విచ్చలవిడిగా క్రైంరేట్ పెరిగిపోతుంటే...రేవంత్‌రెడ్డి ఇవేమీ పట్టించుకోకుండా అంతా బాగున్నట్టు మిస్‌వరల్డ్ పోటీల నిర్వహణలో మునిగి తేలుతున్నాడని మండిపడ్డారు.

**అందాల పోటీల పేరుతో దుబారా**

రాష్ట్రం దివాళా తీసిందని, ఎక్కడ అప్పు పుట్టడం లేదని, కేంద్రంలో తనను చెప్పులు ఎత్తుకుపోయే వాడిలాగా చూస్తున్నారని మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి....అందాల పోటీల పేరుతో వందల కోట్లు దుబారా ఖర్చు ఎందుకు చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. దిగజారుడు మాటలు, పిచ్చిప్రేలాపనలు మాని ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలు, పరిపాలనపై దృష్టి సారించాలని రేవంత్‌రెడ్డికి సూచించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, సమయం వచ్చినపుడు వడ్డీతో సహా చెల్లిస్తారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి పరిపాలనతో విసుగు చెందుతున్న ప్రజలే ఆయన రాజకీయ ఆనవాళ్లు తెలంగాణ నుంచి శాశ్వతంగా చెరిపేస్తారని ఘాటుగా హెచ్చరించారు.

# తండ్రి చేతిలో కొడుకు హతం

### కామారెడ్డి మండలం లింగాపూర్‌లో ఘటన



వడ్ల నిఖిల్ (ఫైల్)

కామారెడ్డి, మే 19 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో ఓ తండ్రి తన కొడుకును హతమార్చాడు. దేవునిపల్లి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్ గ్రామానికి చెందిన వడ్ల నిఖిల్ (24) ఉపాధి కోసం దుబాయికి వెళ్లి మూడు నెలల క్రితం ఇంటికి తిరిగివచ్చాడు. వచ్చిన నాటి నుంచి గంజాయి, మద్యానికి బానిసయ్యాడు. ఏ పని చేయకుండా డబ్బుల కోసం ప్రతిరోజూ తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. సోమవారం తన తండ్రి భాస్కర్‌తో గొడవపడుతుండగా నిఖిల్‌ను ఇనుప రాడ్డుతో బలంగా కొట్టాడు. దీంతో నిఖిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి భాస్కర్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. నిఖిల్ సోదరి రాళ్లపల్లి ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

- పదేండ్ల పాలన వైభవం చూసి ప్రపంచ అందగత్తెల పరవశం
- కేసీఆర్ అనే మూడక్షరాలు తెలంగాణ ప్రజల మనోఫలకంపై శిలాక్షరాలు
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



కేసీఆర్ అంటే విజనరీ.. రేవంత్ అంటే ప్రిజనరీ

## కేసీఆర్‌వి అభివృద్ధి ఆనవాళ్లు..
# రేవంత్‌ది అవినీతి పరవళ్లు

ఖలీల్‌వాడి/ఆర్మూర్‌టౌన్, మే 19 : కేసీఆర్ పదేండ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణ ధరిత్రి మురిసేలా చరిత్రకెక్కిన ఆనవాళ్లు అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అభివర్ణించారు. రేవంత్‌రెడ్డివి తెలంగాణ పరువు తీస్తున్న అవినీతి పరవళ్లు అని విమర్శించారు. కేసీఆర్ అంటే విజనరీ, రేవంత్‌రెడ్డి అంటే ప్రిజనరీ అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనచూసి ప్రపంచ అందగత్తెలు పరవశించారని, కేసీఆర్ అద్భుత కట్టడాలు ప్రపంచానికి తెలిసేలా చేసిన రేవంత్‌రెడ్డికి థ్యాంక్స్ అని పేర్కొన్నారు. సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్, టీ-హబ్ వంటివి కేసీఆర్ విజయాలని తెలిపారు. వీటిని ఎవరు కట్టారని విశ్వసుందరీమణులు అడగలేదా ? అని ప్రశ్నించారు. పునఃనిర్మించిన యాదాద్రి దేవస్థానం కేసీఆర్ ఆధ్యాత్మిక ప్రస్థానానికి ప్రతీక అని అభివర్ణించారు.

**సాగువిస్తీర్ణం పెంచిన చరిత్ర కేసీఆర్‌ది**

కాళేశ్వరం నుంచి మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వరకు, రైతుబంధు నుంచి దళిత బంధు వరకు కేసీఆర్ సాధించిన అద్భుతమైన విజయాలని గుర్తు చేశారు. గత ప్రభుత్వాల హయాంలో 2013-14 వరకు కోటీ 55 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే, కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు నిర్మించి 2022-23 నాటికి 2 కోట్ల 29 లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెంచిన చరిత్ర కేసీఆర్‌దని పేర్కొన్నారు. ఆహార పంటల ఉత్పత్తికి సంబంధించిన 2013-14 లో 2.25 కోట్ల టన్నులు పండిస్తే 2023-24 లో 5 కోట్ల టన్నుల ఉత్పత్తి సాధించడం కేసీఆర్ విజన్‌కు నిదర్శనమని పేర్కొన్నారు. 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, రైతుబంధు సహా అనేక వ్యవసాయ అనుకూల విధానాల ఫలితాలు చెరిపేస్తే చెరగని కేసీఆర్ ఆనవాళ్లు అని తెలిపారు.

**అభివృద్ధి జాడలన్నీ కేసీఆర్ ఆనవాళ్లే..**

కేసీఆర్ కిట్ నుంచి కల్యాణలక్ష్మి వరకు, కరెంట్ వెలుగుల నుంచి కంటి వెలుగు వరకు, పట్టణాల నుంచి పల్లెల వరకు అభివృద్ధి జాడలన్నీ కేసీఆర్ ఆనవాళ్లే అని తెలిపారు. దమ్ముంటే చెరిపేయాలని, రేవంత్‌రెడ్డి పాలనలో చెప్పుకోవడానికేమున్నదని ప్రశ్నించారు. ఒక్క స్కీము, ఒక్క డ్యాం ప్రారంభించలేదని, కూల్చివేతలు, కాల్చివేతేలు, పేల్చివేతలు తప్ప రేవంత్‌రెడ్డి చెప్పుకోవడానికి ఏమున్నాయని ఎద్దేవా చేశారు. ఈ ఘన కార్యాలే అందగత్తెలకు చూపించాలని సూచించారు. రేవంత్ రెడ్డి ధనదాహానికి బలై మసిబారిన మూసీ పేద బతుకులు చూపించాలన్నారు. హెచ్‌సీయూ భూముల స్వాహాకు చేసిన కుట్రలు చెప్పాలని, సమాధైన 420 హామీలు, ఆరు గ్యారెంటీల మోసాలను వివరించాలని సూచించారు. కేసీఆర్ ఆనవాళ్లు తెలంగాణ ప్రజల గుండె చప్పుళ్లు అని, తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు కేసీఆర్ అనే మూడక్షరాలు ప్రజల మనోఫలకంపై చెరగని శిలాక్షరాలని పేర్కొన్నారు.


## భారత్‌మాతాకీ జై



భారత సైనిక దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం తిరంగయాత్ర నిర్వహించారు. సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఇందూరు జిల్లా అధ్వర్యంలో 'మేము సైతం దేశం కోసం' అనే నినాదంతో కొనసాగిన ఈ యాత్రలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో పాటు నాయకులు, యువకులు, నగరవాసులు పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడిన భారత సాయుధ దళాలకు అభినందనలు తెలిపారు.

– సుభాష్‌నగర్, మే 19

## వివాహ వేడుక



బాన్సువాడ, మే 19 : బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు షేక్ జుబేర్ కూతురి వివాహం బీర్కూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాలులో సోమవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, నిజామాబాద్ రూరల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్దన్, గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తదితర నాయకులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.